క్లుప్తంగా

ఆర్బీకే నూతన భవనంలోనే సేవలు



అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురం రైతు భరోసా కేంద్రంపై ఈనాడు దినపత్రిలో వచ్చిన కథనం వాస్తవదూరంగా ఉందని మండల వ్యవసాయ శాఖాధికారి అహ్మద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గతేడాది వైకుంఠపురం అర్బీకే సెంటర్‌ను ప్రారంభించామని, కొన్ని నిర్మాణ పనులు పూర్తిచేసి ఈ ఏడాది జనవరిలో వ్యవసాయశాఖకు అప్పగించినట్లు చెప్పారు. అయితే రైతులు పాత ఆర్బీకే కేంద్రానికి రావడంతో ఈ-క్రాప్ బుకింగ్, ఈకేవైసీపీ సేవలు అందించినట్లు చెప్పారు. ప్రతిరోజు ఆర్బీకే భవనంలోనే సేవలందిస్తున్నట్లు స్పష్టం చేశారు.

మాదలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

మాదల(ముప్పాళ్ళ): మాదల-1 సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. 412 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యులు పి.రమాదేవి తెలిపారు. 28 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, వారిలో 22 మందికి కళ్ల జోళ్లు అందించారు. గర్భిణులకు, బాలింతలకు అవసరమైన టీకాలు అందించారు. శిబిరంలో వైద్యులు వై.ధర్మానాయక్(ఆర్థో), వై.శ్రీనివాస్(ఆర్థో), మిధున్ (అప్తమాలజిస్ట్) పాల్గొని వైద్య సేవలందించారు. శిబిరాన్ని ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్, జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ సందర్శించారు. గ్రామ సర్పంచ్ శింగంశెట్టి కోటేశ్వరమ్మ, ఉప సర్పంచ్ చిమటా శ్రీనివాసరావు, ఎంపీటీసీ గోగుల అంజిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కానాల పుల్లారెడ్డి, పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఆంజనేయులు, ఆరోగ్య పర్యవేక్షకులు ఏ.పీటర్ డేమియన్, జోస్పిన్‌రాణి, ఏఎన్‌ఎంలు పావని తదితరులున్నారు.

'ఇంటింటికి సీపీఐ'ని జయప్రదం చేయండి



క్రోసూరు: భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర పిలుపు లో భాగంగా మండల కేంద్రమైన ఎస్సీ కాలనీలో క్రోసూరు శాఖ మంగళవారం నిధి సేకరణ నిర్వహించింది. పల్నాడు జిల్లా ప్రజా నాట్య మండలి సీపీఐ కార్యవర్గ సభ్యులు భైరాపట్నం రామకృష్ణ పాల్గొన్నారు. నగరంలోని ప్రజలు స్పందించి ఇంటింటికి సీపీఐ కార్యక్రమంలో భాగంగా మీ వద్దకు వచ్చే మా కార్యకర్తలకు ఉద్యమ నిధిని అందజేసి, సహకరించాల్సిందిగా కోరారు. సీపీఐ పోరాటాల ఫలితంగా అనేక సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ సీపీఐ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు, మండల సీపీఐ కార్యదర్శి పోతుగంటి నాగేశ్వరరావు, రైతు సంఘం అధ్యక్షులు కంచేటి పెద్దబ్బాయి పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

ముప్పాళ్ళ: గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం పశ్చిమ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ కోరారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం జరిగింది. బాలకృష్ణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ, కార్మిక రంగాలకు తూట్లు పొడుస్తోందని విమర్శించారు. వ్యవసాయ కూలీలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేసి రెండు వందల రోజుల పని దినాలు కల్పించి రూ.600లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్లతో ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం, కౌలు రైతు సంఘాలు, సీఐటీయూ వ్యవసాయకార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

రైతు కార్మిక సంఘం రౌండ్ టేబుల్ సమావేశం



నకరికల్లు: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న చేపట్టనున్న గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని రైతు కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేసి కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీపీఐయూ జిల్లా మహిళ సంఘ అధ్యక్షురాలు గాదె కుమారి, పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సైదా, మాల మహానాడు సోషల్ మీడియా ఇన్‌చార్జి గోదా బాలా, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఇదే కదా రైతు శ్రేయస్సుకు నిదర్శనం

నాడు... టీడీపీ ప్రభుత్వంలో రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం రోడ్డు ఎక్కే వారు. ఇంకా చెప్పాలంటే కల్తీ పురుగు మందులను నివారించాలని కూడా ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. నాణ్యమైన విత్తనాలు సకాలంలో దొరక్క ఎన్నో ఇబ్బందులు పడేవారు. పండించిన పంట ఉత్పత్తులకు మద్దతు ధర లేక పంట ఉత్పత్తులను దహనం చేసిన ఘటనలు కోకొల్లలు. దీంతో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నా మండల వ్యవసాయశాఖాధికారికి సాధ్యమయ్యేది కాదు.

నేడు... వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా రైతు భరోసా కేంద్రాలను గ్రామ స్థాయిలో ఏర్పాటు చేశారు. వాటి ద్వారా సర్టిఫైడ్ విత్తనాలను, ఎరువులను నేరుగా రైతుల ఇళ్లకే అందించే ఏర్పాట్లు చేశారు. గడిచిన ఐదేళ్లలో ఎక్కడా రైతులు రోడ్డెక్కి విత్తనాలు, ఎరువుల కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేసిన ఘటనలు లేవు. గ్రామ సచివాలయాలకు అనుబంధంగా ఆర్బీకేలను ఏర్పాటు చేసి.. సిబ్బందిని నియమించడంతో రైతులకు వారు అందుబాటులో ఉంటున్నారు. వ్యవసాయ ఉత్పత్తులను మద్దతు ధరకు రైతు భరోసా కేంద్రాల్లోనే కొనుగోలు చేస్తున్నారు.

- రైతు భరోసా కేంద్రాలతో రైతులకు మేలు
- నాణ్యమైన విత్తనాలు, ఎరువులు నేరుగా అందజేత
- సాగులో సూచనలు, సలహాలిచ్చేందుకు అందుబాటులో సిబ్బంది
- నియోజకవర్గ వ్యాప్తంగా 50 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు
- రూ.11.99 కోట్లతో ఆర్బీకేలకు పక్కా భవనాలు
- పల్లె గడపదాటే పనిలేకుండా సకాలంలో సేవలు



ధూళ్ళిపాళ్ల రైతు భరోసా కేంద్రం

నియోజకవర్గంలో రైతు భరోసా కేంద్రాలు ఇలా..

మండలం	ఆర్బీకేలు	సొంత భవనాలు	అద్దె భవనాలు
సత్తెనపల్లి	19	13	06
ముప్పాళ్ళ	10	05	05
రాజుపాలెం	10	09	01
నకరికల్లు	11	11	-
మొత్తం	50	38	12


ఆర్బీకేలో ఎరువులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీ




పవర్‌స్ప్రేయర్లు పొందుతున్న రైతులు

సత్తెనపల్లి: అన్నదాతల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. నియోజకవర్గంలో సత్తెనపల్లి పట్టణంతో పాటు సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాలు ఉన్నాయి. నాలుగు మండలాల్లో 50 రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు చేశారు. విత్తనం దగ్గర నుంచి పంట ఉత్పత్తులు అమ్ముకునే వరకు రైతులకు ఆర్బీకేలు అండగా నిలుస్తాన్నాయి. రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్లు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు క్షేత్ర స్థాయిలో పొలాలకు వెళ్లి రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో టీవీలను ఏర్పాటు చేసి శాస్త్రవేత్తల పరిశోధన ఫలితాలను, ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరిస్తున్నారు.

పక్కా భవనాలు...

గ్రామస్థాయిలో రైతులకు సేవలందించే రైతు భరోసా కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో భవనానికి రూ.21.80 లక్షల చొప్పున 55 భవనాలకు రూ.11.99 కోట్లు కేటాయించింది. వీటిలో 38 భవనిర్మాణాలు పూర్తికాగా 12 భవనాలు నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

65 రకాల సేవలు..

ఆర్బీకేల్లో మొత్తం 65 రకాల సేవలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. ఇందులో వ్యవసాయ శాఖకు సంబంధించి 16, ఉద్యాన శాఖ 12, పశువర్ధక శాఖ 21, మత్స్యశాఖ 11, మార్కెటింగ్ శాఖకు సంబంధించి 5 సేవలను రైతులకు అందిస్తున్నారు. ప్రకృతి విపత్తులు వచ్చి రైతులకు నష్టం జరిగినప్పుడు రైతు భరోసా కేంద్రాల్లో ఉండే సిబ్బంది వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదికను పంపుతున్నారు. అదే సీజన్‌లోనే పంట నష్టపరిహారం రైతులకు అందుతోంది. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో రైతులు సాగుచేసిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేస్తున్నారు. రైతు భరోసా నిధులు, పంటల బీమా, సున్నా వడ్డీ, పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అమలు చేస్తున్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో కస్టం హియరింగ్ సెంటర్‌లను ఏర్పాటు చేసి రూ. 15 లక్షల విలువైన ట్రాక్టర్, వ్యవసాయ పరికరాలను రైతులకు అందుబాటులో ఉంచారు.

గ్రామంలోనే సమస్యల పరిష్కారం



గతంలో పంట నష్ట పరిహారం, ఇతర సమస్యలు ఉంటే మండల వ్యవసాయ కార్యాలయం చుట్టూ తిరిగేవాళ్లం. ఇప్పుడు రైతు భరోసా కేంద్రాలు ఉండడంతో మా సమస్యలన్నీ గ్రామ స్థాయిలోనే పరిష్కారం అవుతున్నాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు, కందులు, మినుములు సబ్సిడీపై ఇస్తున్నారు. పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసి ఉచిత పంటల బీమాకు అర్హత పొందేలా చేస్తున్నారు. నేను కౌలు రైతును అయినప్పటికీ రైతుభరోసా నగదు నాలుగేళ్లుగా అందిస్తున్నారు.

–పాలేటి పిచ్చియ్య, కౌలు రైతు, బీమవరం.

సకాలంలో విత్తనాల పంపిణీ



గతంలో మండల వ్యవసాయ కార్యాలయానికి వెళ్లి రోజుల తరబడి క్యూలో ఉంటే తప్ప విత్తనాలు అందేవి కావు. ఇప్పుడు ఆ బాధలు తప్పాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా అవసరమైన విత్తనాలు, ఎరువులు అధికారులు అందిస్తున్నారు. సమయం ఆదా అయ్యి, నాణ్యమైన విత్తనాలు అందుతున్నాయి. సకాలంలో విత్తనాలను పొంది, సాగుకు అనుకూలంగా ఉంది.

–చీడిపూడి నాగార్జునరెడ్డి, రైతు, గుడిపూడి

మద్దతు ధర పొందవచ్చు



రైతులు పండించిన పంట ఉత్పత్తులను రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించుకోవడం వల్ల మద్దతు ధరను పొందవచ్చు. రైతుకు అవసరమైన ప్రతి ఒక్కటి రైతు భరోసా కేంద్రాల్లోనే లభిస్తోంది. గ్రామంలోనే అవసరమైన ఎరువులు, విత్తనాలు పొందడంతో పాటు పంట దిగుబడులకు అవసరమైన సలహాలు, సూచనలు పొందవచ్చు. అన్ని విధాల రైతులకు రైతు భరోసా కేంద్రం తోడుగా ఉంటుంది.

–ఎస్.శ్రీధర్‌రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు, సత్తెనపల్లి

సమన్వయంతో సమస్యలకు పరిష్కారం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- క్రోసూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: గ్రామాల్లోని సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పరిష్కరించుకోవాలని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ పెరుమాళ్లపల్లి కోటయ్య అధ్యక్షత వహించారు. గౌరవ అతిథిగా జెడ్పీటీసీ షేక్ జమీలాగఫూర్, తహసీల్దారు ఎం.సువర్ణ, ఎంపీడీఓ రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమావేశంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ప్రభుత్వాస్పత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యం కోసం సీఎం వైఎస్ జగన్ పాటుపడుతున్నారని, లక్ష్యాలు నెరవేర్చే విధంగా సిబ్బంది పనిచేయాలని సూచించారు. తరచూ ఆసుపత్రులను తనిఖీ చేస్తానని, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని చెప్పారు. ఈ సందర్భంగా పీఆర్ ఏఈ జయరామిరెడ్డి మాట్లాడుతూ.. 15వ ఆర్థిక సంఘం నిధులు సిద్ధంగా ఉన్నాయని ప్రజా ప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలని కోరారు. పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ రమాదేవీ మాట్లాడుతూ పీహెచ్‌సీ ద్వారా జగనన్న ఆరోగ్య సురక్ష, కాన్పులు, తదితర ప్రభుత్వ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి 3న పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. పశు వైద్యుడు డాక్టర్ మల్లయ్య మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అన్ని రకాల పశువులకు బీమా చేయిస్తున్నామని, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఈ వేణుగోపాల్ మాట్లాడుతూ మిర్చి పంట ప్రస్తుత పరిస్థితుల్లో బాగా లేదని, ధర కూడా తక్కువగా ఉందన్నారు. ఆరుతడి పంటలకు నీరుకావాలని నీటిశాఖ అధికారులకు నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ఎంపీపీ విప్పల వెంకట్రామిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, షేక్ గఫూర్, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం


వైద్య సేవలందిస్తున్న వైద్యులు, సిబ్బంది

బెల్లంకొండ: రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని ప్రభుత్వ వైద్య సేవలను 'జగనన్న ఆరోగ్య సురక్ష' పథకం ద్వారా ప్రజల ఇళ్ల వద్దకు తీసుకువచ్చారని పీహెచ్‌సీ వైద్యుడు కె.వి.కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వెద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గంగిరెడ్డి హనుమాయమ్మ ప్రతాపరెడ్డి ప్రారంభించారు. శిబిరంలో 38 మంది గర్భిణులకు, 182 మంది ఇతర రోగులు, 35 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 202 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్లు క్యాంప్ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆంశుధర్ తెలిపారు. గైనకాలజిస్ట్ తేజశ్విని, అనస్తీషియన్ గిరిరాజు, కంటి వైద్యులు సత్యనారాయణ, ఆయుర్వేద వైద్యులు ఆర్.శ్రీనివాస్, పీహెచ్‌సీ సిబ్బంది, వివిధ గ్రామాల ఏఎన్‌ఎంలు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా మైదానాల అభివృద్ధికి రూ. 25 లక్షలు

శావల్యాపురం: నియోజకరవ్గంలోని ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో క్రీడా మైదానాలు అభివృద్ధి పనులకు రూ. 25 లక్షలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్లు నాడు-నేడు మన బడి పథకం ఏఈ విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి క్రీడా మైదాన పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఒక్కో జెడ్పీ ఉన్నత పాఠశాల్లో క్రీడామైదానం అభివృద్ధి పనులతో పాటు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బాల్‌బ్యాట్‌మెంటిన్ క్రీడాకోర్టులు ఏర్పాటు చేయటానికి గానుపీఎంసీ నిధులు రూ. 5 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఇందులో భాగంగా నూజెండ్ల-5 లక్షలు, శావల్యాపురం-5 లక్షలు, వినుకొండ రూరల్ నాగులవరం గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల-రూ.5 లక్షలు, బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాలకు-రూ.5 లక్షలు, ఈపూరు మండలం ఈపూరు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు రూ. 5 లక్షలు నిధులు మంజూరైనట్లు ఏఈ తెలిపారు. పనులు పరిశీలించిన వారిలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి, పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, సీనియర్ ఆంగ్ల బోధకులు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

లావాదేవీలు స్తంభింపజేస్తాం

బాధిత రైతుల ఆందోళన


బ్యాంకు అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న బాధిత రైతులు

దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు సీజీజీబీలో ఎనిమిది నెలల క్రితం గోల్‌మాల్ అయిన తాకట్టు బంగారాన్ని వెంటనే బాధిత రైతులకి అందించకపోతే బ్యాంకు లావాదేవీలు స్తంభింప చేస్తామని కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో బాధిత రైతులు బ్యాంకు అధికారులకు వినతిపత్రం ద్వారా హెచ్చరించారు. మంగళవారం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు వద్ద బంగారం కోల్పోయిన బాధిత రైతుల సమావేశం జరిగింది. కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి టి.హనుమంతరావు మాట్లాడుతూ బ్యాంకులో బంగారం కనిపించకుండా పోయి 8 నెలలు కావస్తున్నప్పటికీ బ్యాంకు సిబ్బంది, ఉన్నత స్థాయి అధికారులు చెప్పే దానికి పొంతన లేదన్నారు. ఈ విషయంపై పలుమార్లు వివిధ స్థాయిలో అధికారులను కలిసినప్పటికీ స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు బ్యాంకు లావాదేవీలను స్తంభింప చేస్తామని హెచ్చరించారు. అనంతరం రైతులతో సంతకాలు సేకరించి మెమోరాండం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆవుల ఆంజనేయులు, మర్రి రామకృష్ణారెడ్డి, షేక్ కరిముల్లా, ఇనగంటి రాంబాబు, కిషోర్, షేక్ ఆర్.బాజివలి, షేక్ నాగుల్ షరీఫ్, ఎ.వెంకటరమణ, శ్రీధర్‌బాబు ,పి.సాంబశివరావు, కె.వీరమ్మ, ఆవుల బాజీ, షేక్ రవుఫ్, గంట బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


పైడిపాటి సురేష్ మృతదేహం

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన గండ్లూరు అడ్డ రోడ్డు సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మేడికొండూరు మండలం కొరప్రాడుకు చెందిన పైడిపాటి సురేష్ (27) తన బంధువుతో కలిసి ద్విచక్ర వాహనంపై పాకాలపాడులోని వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చాడు. పూలు తీసుకు రమ్మని చెప్పడంతో ద్విచక్ర వాహనంపై సత్తెనపల్లి వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అచ్చంపేట మండలం తాడువాయి నుంచి మిర్చి టిక్కీలతో వస్తున్న డీసీఎం వాహనం, ద్విచక్ర వాహనం గండ్లూరు అడ్డరోడ్డు సమీపంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు సురేష్‌ను అంబులెన్స్‌లో సత్తెనపల్లి వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య శోభ, పిల్లలు ఆకాంక్ష, అక్షయ ఉన్నారు. సురేష్ మృతి వార్త తెలియడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, డీసీఎం వాహనాన్ని స్వాధీనపర్చుకొని సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా యువకుడు మృతి చెందినప్పటికీ బాధ్యులపై చర్యలు తీసుకోకుండా డీసీఎం వాహనాన్ని వదిలేస్తున్నారంటూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులకు, బాధితులకు మధ్య వాగ్వావాదం చోటు చేసుకొంది. పోలీసులు వారికి నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. తమకు న్యాయం చేయాలంటూ మృతుడి బంధువులు ఆందోళన చేయడంతో పంచాయతీ నడుస్తోంది.

ఉద్యమ కార్యాచరణను విజయవంతం చేయండి


ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తున్న జేఏసీ నాయకులు

సత్తెనపల్లి: సమస్యల పరిష్కారానికి బుధవారం నుంచి జరగనున్న ఉద్యమ కార్యాచరణను విజయవంతం చేయాలని ఏపీ జేఏసీ సత్తెనపల్లి తాలూకా యూనిట్ చైర్మన్ పెండెం మణిరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏపీ ఎన్జీవో కార్యాలయం వద్ద మంగళవారం ఉద్యమ కార్యాచరణ ప్రకటించి, సమావేశంలో మాట్లాడారు. విధులకు నల్ల బ్యాడ్జీలతో హాజరు కావడం, తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్లకు మెమొరాండం అందించడం జరుగుతుందన్నారు. ఈ నెల 15, 16న నల్ల బ్యాడ్జీలు ధరించి మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలియజేస్తామన్నారు. 17న తాలూకా స్థాయిలో ర్యాలీ, ధర్నా, 20న జిల్లా కేంద్రాల్లో ర్యాలీ, ధర్నా, 21నుంచి24 వరకు రాష్ట్ర నాయకులు జిల్లాలు తిరుగుతూ ఉద్యమ కార్యాచరణను ఉధృతం చేయడం జరుగు తుందన్నారు. 27న చలో విజయవాడ జరుగుతుందన్నారు. ఉద్యోగు, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసం

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో బుధవారం వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోలా వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుదవారం ఉదయం 8గంటల లోపు అక్షరాబ్యాసం కోసం తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకోవాలన్నారు. ఉదయం సరస్వతీ హోమం, సరస్వతీ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తామని తెలిపారు.

ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్లుగా దేవరాజ్, అనీల్

అమరావతి: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నూతన కమిటీకి అమరావతికి చెందిన గుడిశె దేవరాజ్, చౌటపల్లి అనీల్ కౌన్సిలర్లుగా ఎంపికయ్యారు. ఆదివారం ఎస్టీయూ ఏపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఎల్వీ రామిరెడ్డి ఆధ్వర్యంలో నర్సరావుపేటలో 77వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి రాష్ట్ర కౌన్సిలర్లుగా గుడిశె దేవరాజ్, చౌటపల్లి అనీల్‌ను ఎంపిక చేసి మంగళవారం ప్రకటించారు. నూతన రాష్ట్రకౌన్సిలర్లను పలు మండలాల ఎస్టీయూ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు అభినందించారు.

నేడు శిశుమందిర్‌లో అక్షరాభ్యాసం

సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్డులో ఉన్న శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో వసంత పంచమి పురస్కరించుకొని చిన్నారులకు శివస్వామి చేతుల మీదుగా అక్షరాభ్యాసం జరుగుతుందని ప్రధానాచార్యులు మన్నవ ధనలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 93923 35903 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

నేడు గాయత్రీ మహాయజ్ఞం

ముప్పాళ్ళ: కుందురువారిపాలెంలోని శ్రీసాందీపని ఆశ్రమ 8వ వార్షికోత్సవం సందర్భంగా 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం బుధవారం జరుగుతుందని ఆశ్రమ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. మాఘ పంచమి, పండిత శ్రీరామశర్మ ఆచార్య, ఆధ్యాత్మిక జన్మదినం, జ్ఞాన సరస్వతి మాత జయంతిని పురస్కరించుకొని ఉదయం మహా యజ్ఞం జరుగుతుందన్నారు. సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. భక్తులు గాయత్రి మహాయజ్ఞంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పురుగు మందుల వ్యాపారి మృతి

సత్తెనపల్లి: పట్టణానికి చెందిన శ్రీ లక్ష్మీ శ్రీనివాస ట్రేడర్స్ పురుగు మందుల వ్యాపారి, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ సభ్యుడు చీమకుర్తి సుబ్రహ్మణ్యం (52) సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. మృతుడికి భార్య పద్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సుబ్రహ్మణ్యం మృతి వార్త తెలుసుకున్న పలువురు వ్యాపారులు మంగళవారం మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

వెల్దుర్తి: పంట పొలంలో నీళ్ల పెట్టేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మాచర్ల పట్టణ శివారులోని రామప్ప దేవాలయం వద్ద మంగళవారం జరిగింది. పట్టణానికి చెందిన కొత్తకాపు శివశంకర్‌రెడ్డి(58).. రవి స్వీట్స్ షాపు నిర్వహిస్తున్నాడు. శివశంకర్‌రెడ్డి పట్టణ సమీపంలోని కౌలు పొలంలో నీళ్ల పెట్టేందుకు పొలానికి వెళ్లాడు. విద్యుత్ తీగలకు మరమ్మతులు చేపడుతున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురైన మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలున్నారు. మాచర్ల పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కోడి పందేల స్థావరంపై దాడి

మాచర్ల రూరల్: కోడి పందేలు నిర్వహిస్తున్న వారిని అదుపులోకి, వారి నుంచి రూ.11,960లు నగదును స్వాధీనపర్చుకున్న ఘటన మండలంలోని జమ్మలమడక గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. గ్రామ శివారులో కొందరు కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో దాడిచేసి, తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొన్నట్లు తెలిపారు. పందెపు కోడిని స్వాధీనపర్చుకుని, కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ కె.రాజశేఖర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

నరసరావుపేటటౌన్: ప్రయాణికులతో వెళ్తున్న ఆటోని లారీ ఢీకొన్న ఘటన మంగళవారం పట్టణ శివారు జొన్నలగడ్డ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం ప్రయాణికులతో వస్తున్న ఆటోను మిర్చిలోడుతో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ప్రయివేట్ వైద్యశాలకు తరలించారు. సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని రూరల్ ఎస్ఐ రోశయ్య తెలిపారు.